


దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 90 | సోమవారం 31-03-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## ముగ్గురు పిల్లలు, సవతి తల్లి మృత్యువాత

**కామారెడ్డి జిల్లా వెంకటాపూర్‌లో ఉగాది పండుగ రోజున ఘోరం**

**ఎల్లారెడ్డి, మార్చి 30:** ఉగాది పండుగ వేళ ఓ ఇంట విషాద ఛాయలు అలుముకున్నాయి. సవతి పిల్లలను కాపాడబోయి వారితో పాటు ఆ తల్లి కూడా మృత్యువాత పడింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం భిక్కనూరు పంచాయతీ వెంకటాపూర్ అగ్రహారంలో ఈ విషాదం జరిగింది. గ్రామానికి చెందిన బొమ్మర్ది లింగయ్యకు గతంలో మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన శ్యామలతో వివాహం అయింది. కూతుళ్లు మైథిలి, అక్షర, కుమారుడు వినయ్ పుట్టిన కొన్నాళ్లకు శ్యామల అనారోగ్యంతో చనిపోయింది. దాంతో లింగంపేట్ మండలం షెట్‌పల్లికి చెందిన మౌనికను లింగయ్య వివాహం చేసుకున్నాడు. మౌనికకు కూడా ఇది రెండో వివాహమే. లింగయ్య కూలి పనులు చేసుకుంటూ తండ్రి లక్ష్మయ్య, భార్య మౌనిక(26), ఇద్దరు కూతుళ్లు మైథిలి(10), అక్షర(9), కుమారుడు వినయ్(7)లతో కలిసి జీవిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం మౌనిక చెరువులో బట్టలు ఉతకడానికి వెళుతుండగా పిల్లలు కూడా వెళ్లారు. మౌనిక పని చేసుకుంటుండగా చెరువులో స్నానానికి దిగిన పిల్లలు మునిపోతుండడంతో వారిని కాపాడబోయి మౌనిక కూడా నీట మునిగింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చెరువు వద్దకు వెళ్లి



చూడగా గట్టున వారి చెప్పులు, బట్టలు కనిపించాయి. పోలీసులకు సమాచారం అందించగా .. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్ గజ ఈతగాళ్లతో వెతికించి ఆదివారం తెల్లవారుజామునకు నలుగురి మృతదేహాలను బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వినయ్ గ్రామంలో రెండవ తరగతి చదువుతుండగా మైథిలి, అక్షర మెదక్‌లోని ఓ ప్రభుత్వ హాస్టల్లో చదువుకుంటున్నారు. ఉగాది పండుగకు ఇంటికి వచ్చిన పిల్లలు మృత్యువాత పడడంతో బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

## బియ్యం ఖర్చంతా కేంద్రానిదే..

**మేం రూ.40 చెల్లిస్తే.. రాష్ట్రానిది రూ.10లే**

**బీఆర్ఎస్‌పై కేసుల్లో కాంగ్రెస్ యూటర్న్**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



**తొలి సమయం కరీంనగర్, మార్చి 30:** రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీని స్వాగతిస్తున్నామని, అయితే బియ్యం ఖర్చంతా కేంద్రమే భరిస్తుందని, కిలోకు కేంద్ర ప్రభుత్వం రూ.40లు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వంపై రూ.10లు మాత్రమే భారం పడుతోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. జీహెచ్ఎంసీ పరిధిలో జరిగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉంటూ మజ్లిసను గెలిపించేందుకు సిద్ధమయ్యాయన్నారు. బీజేపీకి సరిపడా బలం లేక పోయినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నదని తెలిపారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై అందరి అభిప్రాయాలు తీసుకున్నామని, త్వరలోనే పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందుతుందన్నారు. బీఆర్ఎస, కేసీఆర్‌లపై కేసుల విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుందని విమర్శించారు. టెర్రరిస్టులకు అడ్డాగా దారుస్సలాం మారిందని ఆరోపించారు. ఒవైసీ కుటుంబ వ్యాపారాలు కాపాడుకునేందుకు అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి అమ్ముడుపోయే పార్టీ మజ్లిస్ అని, దానికి తెలంగాణ అంతటా పోటీ చేసే దమ్ము లేదని బండి సంజయ్ విమర్శించారు. సెంట్రల్ వర్సిటీ విద్యార్థులపై లాఠీచార్జి చేయడం అమానుషమని బండి సంజయ్ అన్నారు. పోలీసు బలగాలను ఉపయోగించి విద్యార్థులను భయాందోళనలకు గురిచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్లుగా ఉందని మండిపడ్డారు.

# సంఘ్ ఓ వటవృక్షం

- సేవకు ప్రతిరూపం: ప్రధాని నరేంద్ర మోదీ
- నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ హెడ్‌క్వార్టర్స్ సందర్శన - హెడ్గేవార్, గోల్వాల్కర్లకు నివాళి
- కాంగ్రెస్ విధానాలతోనే నక్సలిజం వ్యాప్తి! - ఛత్తీస్‌గఢ్‌లో ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో మోదీ



**న్యూఢిల్లీ, మార్చి 30:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సేవకు మరో పేరని ప్రధాని మోదీ అన్నారు. అది భారతీయ ప్రాచీన సంస్కృతికి, ఆధునికీకరణకు వటవృక్షంలాంటిదని చెప్పారు. దాని విలువలు, ఆదర్శలు జాతీయ చైతన్యాన్ని పరిరక్షిస్తున్నాయని తెలిపారు. ఆదివారం ఆయన మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ప్రథమ, ద్వితీయ సర్‌సంఘ్‌చాలక్‌లు కేబీ హెడ్గేవార్, ఎంఎస్ గోల్వాల్కర్‌ల స్మృతి మందిరాలకు వెళ్లి నివాళులు అర్పించారు. సంఘ్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించిన రెండో ప్రధాని మోదీ. గతంలో వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు 2000లో వెళ్లారు. ఇద్దరూ మూడోసారి ప్రధాని అయిన తర్వాతే ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడం గమనార్హం. సంఘ్ ప్రాంగణంలో మాధవ్ నేత్రాలయ ఐ ఇన్‌స్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌కు అనుబంధంగా మాధవ్ నేత్రాలయ ప్రీమియం సెంటర్ భవనానికి మోదీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమర మాట్లాడుతూ.. గత వందేళ్లుగా 'సంఘటన్', 'సమర్పణ్'తో ఆర్ఎస్ఎస్ చేస్తున్న తపస్సు.. 'వికసిత్-భారత్-2047' లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ఇప్పుడు ఫలాలందిస్తోందని తెలిపారు. 'వందేళ్ల తర్వాత సంఘ్ మరో మైలురాయి దిశగా కదులుతోంది. స్వాతంత్ర్య పోరాటంలో 1925-47 సంక్షోభ సమయం. ఇప్పుడు 2025-47 మధ్య కాలం కూడా చాలా కీలకమైనది. భారీ లక్ష్యాలు మన ముందున్నాయి. వచ్చే వెయ్యేళ్లు శక్తిమంతమైన, పురోగామి భారత నిర్మాణానికి మనం శంకుస్థాపన చేయాలి' అని అన్నారు. స్మృతిమందిరం వద్ద ఉన్న సందేశ పుస్తకంలో మోదీ హిందీలో సందేశం రాశారు. హెడ్గేవార్, గోల్వాల్కర్‌ల ఆలోచనలు తనతో పాటు ఎంతో మందికి స్ఫూర్తిని, బలాన్ని ఇచ్చాయన్నారు. ఆయన వెంట సంఘ్ చీఫ్ భాగవత్, కేంద్ర మంత్రిగడ్కరీ, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ కూడా ఉన్నారు. నాగపూర్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన 'దీక్షాభూమి'ని కూడా మోదీ సందర్శించారు. 'దీక్షాభూమి' సామాజిక న్యాయానికి, బడుగుల సాధికారతకు చిహ్నమన్నారు. దీక్షాభూమిలోని స్తూపం వద్దకు వెళ్లి 'అంబేడ్కర్ అస్థి' వద్ద మోదీ నివాళులు అర్పించారు.

**కాంగ్రెస్ విధానాలతోనే నక్సలిజం వ్యాప్తి!**

కాంగ్రెస్ దశాబ్దాల తరబడి అనుసరించిన విధానాలు నక్సలిజానికి ఊతమిచ్చాయని మోదీ అన్నారు. అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లోనే నక్సలిజం ప్రబలంగా విస్తరించిందని తెలిపారు. ఇప్పుడు పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయని.. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతిశకం ప్రారంభమైందని చెప్పారు. మోదీ ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లా మోహభట్టాలో జరిగిన బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. అనంతరం రూ.33,700 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అంభన్‌పూర్-రాయ్‌పూర్ మధ్య మెమూ రైలును ప్రారంభించారు. రూ.9,790 కోట్లతో ఎన్‌టీపీసీ నిర్మించే సీపత్ సూపర్ థర్మల్ విద్యుత్కేంద్రం మూడో దశ(800 మెగావాట్లు) కు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.15,800 కోట్లతో నిర్మించిన మొదటి సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టును ప్రారంభించారు. మరోవైపు, ఛత్తీస్‌గఢ్‌లోని బీజీపూర్ జిల్లాలో ఆదివారం 50 మంది నక్సలైట్లు సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసుల ముందు లొంగిపోయారు. వీరిలో 14మందిపై రూ.68 లక్షల మేర రివార్డు ఉందని పోలీసులు వెల్లడించారు. ప్రధాని మోదీ పర్యటనకు కొన్ని గంటల ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

## మారుతున్న భూకంప జోన్లు


**మరో రెండు నెలల్లో ఖరారు ప్రస్తుతం 5 జోన్లు.. 6కు పెంపు**

**భద్రాచలం మినహా సేఫ్‌జోన్‌లో తెలంగాణ**

దేశంలోని భూకంప జోన్లు మారనున్నాయి. ప్రస్తుతం ఐదు జోన్లుండగా.. వాటి సంఖ్య ఆరుకు పెరగనుంది. 1962లో తొలిసారి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఐదు జోన్లను ఏర్పాటు చేయగా.. భారత ప్రమాణాల బ్యూరో(బీఐఎస్) 1970, 1984లో కొన్ని మార్పులు చేసి, జోన్ల పరిధిలోని ప్రాంతాలను మార్చింది. 2002లో 'ఐఎస్ 1893:2002' పేరుతో వాటిని అభివృద్ధి చేసింది. అప్పటి నుంచి భూమి లోపల ఫలకాల కదలికలో వేగం(యాక్సలరేషన్) పెరుగుతూ.. ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో.. భూభౌతిక శాస్త్రవేత్తలు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు, భూకంపాల పరిశోధకులు, బీఐఎస్ అధికారులతో కొత్త జోన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఓ కమిటీని నియమించింది. ఆ కమిటీ పలు భేటీల తర్వాత.. ప్రస్తుతం ఉన్న ఐదు జోన్లను ఆరుగా మార్చాలని నిర్ణయించింది. మరో రెండు నెలల్లో కొత్త జోన్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించనుంది. ప్రస్తుతం ఉన్న జోన్లు రోమన్ నంబర్లలో ఉన్నాయి. జోన్-5లో అత్యంత ప్రమాదకరమైన భూకంపాలు సంభవించే ప్రాంతాలుండగా.. జోన్-2లో అత్యల్ప ప్రభావం ఉంటుంది. కొత్త జోన్లకు ఇదేవిధంగా రోమన్ నంబర్లను వాడాలా? పాత-కొత్త మధ్య అయోమయాన్ని తొలగించేందుకు ఆంగ్ల వర్ణమాలలోని ఏ, బీ, సీ, డీ, ఈ, ఎఫ్‌లను వాడాలా? అనేదానిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని ఈ కమిటీలోని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఈ అంశం మినహా.. ఏ జోన్ పరిధిలోకి ఏయే ప్రాంతాలు వస్తాయి? అనే దానిపై బీఐఎస్ రూపొందించిన 'ఐఎస్ 1893:2025'ని కమిటీ ఖరారు చేసిందని వివరించారు. ప్రమాదకర ఆరోజోన్‌లో ఎగువ హిమాలయాలు, శివాలిక్ శ్రేణులు ఉన్నాయని తాజా మ్యాప్ చెబుతోంది. వీటితోపాటు.. గుజరాత్ రాష్ట్రంలోని కచ్ ప్రాంతం, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలు, కొంకణ్ ఈ జోన్‌లో ఉన్నాయి. హిమాలయాల్లోని జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, నేపాల్‌తో సరిహద్దులను పంచుకుంటున్న ఉత్తరప్రదేశ్, బిహార్‌లోని పలు ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, అండమాన్ దీవులు ఇదే జోన్‌లో ఉన్నాయి. భూగర్భంలో ఫలకాల కదలికకు సంబంధించిన యాక్సలరేషన్ ఈ ప్రాంతాల్లో 5జీ(గ్రావిటీ)గా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో భూగర్భంలో ఫాల్ట్స్ కారణంగా భూకంప తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అంతర్-ఫలకల ప్రాంతం కావడంతో నష్టం తీవ్రంగా ఉంటుందని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రదీపకుమార్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

# పేదలకు ఇక పండగే

- 3 కోట్ల మందికి ఉచితంగా సన్నబియ్యం.. చరిత్రలో శిలాశాసనంలా నిలిచిపోయే పథకం
- ఏ ప్రభుత్వం వచ్చినా దీనిని కొనసాగించాల్సిందే
- రూ.21 వేల కోట్ల వడ్లను తాకట్టు పెట్టిన గత ప్రభుత్వం
- 7వేల కోట్ల ధాన్యం వేలమేస్తే వచ్చింది 3వేల కోట్ల ధాన్యమే
- నల్లగొండకు నీళ్లివ్వాలనే ఆలోచనే బీఆర్ఎసకు లేదు
- ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదు.. ఓట్లు సీట్లపైనే వారి ధ్యాస
- కాళ్లలో కట్టె పెట్టి కింద పడేయాలని చూస్తున్నరు
- మా కార్యకర్తలు కళ్లలో కారం కొడతారు: సీఎం రేవంత్
- సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి




**తొలి సమయం హుజూర్‌నగర్, మార్చి 30:** సన్నబియ్యం అన్నంతో రాష్ట్రంలోని పేదల ఇళ్లలో ఇక ప్రతిరోజూ పండుగ రోజు కానుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శ్రీమంతుల ఇళ్లలో తిన్నట్లే.. పేద ప్రజలు కూడా ప్రతిరోజూ సన్నబియ్యం తినేలా చేయాలనే సంకల్పంతోనే రాష్ట్రంలోని మూడు కోట్ల మంది ప్రజలకు ఉచితంగా సన్నబియ్యం అందించే పథకాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు రేషన్‌కార్డులపై సన్నబియ్యం అందించే పథకాన్ని ఉగాది రోజున ఆదివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో సీఎం ప్రారంభించారు. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సభావేదిక నుంచి హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన 10 మంది లబ్ధిదారులకు సన్నబియ్యం సంచులను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పేదలకు సన్నబియ్యం పథకం ఆషామాషీ పథకం కాదని, చరిత్రలో శిలాశాసనంలా నిలిచిపోయే పథకమని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా.. ఎవరు సీఎంగా ఉన్నా.. ఈ పథకాన్ని కొనసాగించి తీరాల్సిందేనన్నారు. ఇప్పటివరకు రేషన్ దుకాణాల ద్వారా పేదలకు దొడ్డు రకాల బియ్యం అందుతున్నాయని, ఇందుకోసం ప్రతి ఏటా రూ.10,565 కోట్ల ప్రజాధనం ఖర్చు చేస్తున్నామని చెప్పారు. అయితే.. కాలక్రమేణా ప్రజలు దొడ్డు బియ్యం తినడం మానేయడంతో.. అవి పక్కదారి పడుతున్నాయన్నారు. దొడ్డు బియ్యం తిరిగి తిరిగి మిల్లర్ల ద్వారా మళ్లీ ప్రభుత్వానికే వస్తున్న విషయాన్ని గుర్తించి దానిని కట్టడి చేయాలని భావించామని, ఆ మథనం నుంచే సన్నబియ్యం పంపిణీ చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం రూ.21 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని మిల్లర్ల వద్ద తాకట్టు పెట్టిందని సీఎం అన్నారు. చివరకు రూ.7 వేల కోట్ల విలువైన ధాన్యానికి టెండర్లు వేస్తే ఇప్పటికి రూ.3 వేల కోట్ల విలువైన ధాన్యమే వచ్చిందన్నారు.


**కేసీఆర్ ఈ ఆలోచన ఎందుకు చేయలేదు?**

మాజీ సీఎం కేసీఆర్ పదేళ్లలో ఏనాడూ పేదలకు సన్నబియ్యం ఇవ్వాలనే ఆలోచన చేయలేదని సీఎం రేవంత్ విమర్శించారు. పైగా రైతులు వరి వేయవద్దని, వరి వేస్తే ఉరేనని బెదిరించారని, కానీ.. తన ఫాంహౌసలో మాత్రం వెయ్యి ఎకరాల్లో వరి పండించారని అన్నారు. ఆ ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.4500కు కావేరి సంస్థ కొనుగోలు చేసిందని, తాను పూర్తి ఆధారాలతోనే ఈ ఆరోపణ చేస్తున్నానని తెలిపారు.

## 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం

**ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి,**

**సంక్షేమంపై సీఎం దృష్టి.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**సత్తుపల్లి, మార్చి 30:** రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కల్లూరుగూడెంలో నిర్మించనున్న ఆయిల్‌పామ్ కర్మాగారానికి ఆదివారం రాత్రి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో పది లక్షల ఎకరాలు, వచ్చే సీజన్‌లో మరో 10 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పామాయిల్ సాగులో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉంటుందన్నారు. ఇతర దేశాల నుంచి నాణ్యమైన, తక్కువ కాల పరిమితిలో దిగుబడి వచ్చే, ఎత్తు తక్కువగా పెరిగే ఆయిల్‌పామ్ మొక్కలను తెప్పించాలని ఆయిల్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆపకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూ.. ఆరు పథకాల హామీని నెరవేర్చే దిశగా కృషి జరుగుతోందన్నారు.

## మరసం ఆధ్వర్యంలో ఘనంగా కవి సమ్మేళనం..



**తొలి సమయం, మహబూబాబాద్ మర్చి 30:**
జిల్లా కేంద్రంలోని బాలికల హైస్కూల్లో మానుకోట రచయితల సంఘం ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం సందర్భంగా కవి సమ్మేళనం ఘనంగా జరిగింది.. కవులు విభిన్న వచన, గేయ పద్య కవితలు వినిపించారు మానుకోట ప్రముఖ కవి ప్రభత్వ ఉపాధ్యాయులు అద్దెర్ల రమేష్ అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గర్ల్స్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ ఆరుద్ర వెంకటేశ్వర్లు, మరొక ప్రముఖ కవి సయ్యద్ కుర్షిద్, సీనియర్ కవి విరామ ఉపాధ్యాయులు కె.వి.ఆర్ నరసింహారెడ్డి అజీజ్ ఖాన్, బాణాల వీరయ్య పింగిరి శ్రీనివాసరావు తాడూరి వెంకటరామ్ నర్సయ్య ప్రముఖ వ్యాఖ్యాత దాసరి ప్రసాద్, వీరస్వామి, గంట దామోదర్ రెడ్డి బొమ్మిడి వినోద్ రెడ్డి తండా సదానందం సామ సత్యం పద్య కవి జక్కి నాగేశ్వరరావు యువ కవులుగా డాక్టర్ తండా హరీష్ ఎండి రహీముద్దీన్ డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ రేణిగుంట్ల శ్రీదేవి ఎంగిలి దీపిక తదితరులు కవిసమ్మేళనంలో పాల్గొని ఉగాది కవి సమ్మేళనాన్ని విజయవంతం చేశారు

## రంజాన్ ఉపవాసం సందర్భంగా అందరూ ఐక్యంగా



**తొలి సమయం వరంగల్ మార్చ్ 30**
అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు, వరంగల్ ఎల్బీనగర్ లోని ఏ వన్ క్లాసిక్ కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ వైస్ ప్రెసిడెంట్, కాంట్రాక్టర్ మహమ్మద్ మగ్దూం సోదరుడు మహమ్మద్ షకీల్ అహ్మద్ తెలంగాణ లారీ అసోసియేషన్ సెక్రటరీ పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మైనార్టీ నాయకులు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు,ఉపవాస దీక్షలతో ఉన్న ముస్లిం సోదరులకు ఫలహారాలు ఒకరిని ఒకరు తినిపించారు మరియు ప్రేమ ఆప్యాయతతో అందరూ కలిసికట్టుగా ఉండటం రంజాన్ పండుగ ఉపవాస దీక్ష సమయంలో ఒకరిని ఒకరు కలిసికట్టుగా ప్రేమగా ఉండటం రంజాన్ మాసంలో మనం చూస్తుంటాం ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ ఖుసోరో పాషా సాహెబ్ దర్గా పీఠాధిపతి, తవ్వకల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎం ఏ జబ్బార్,కార్పొరేటర్ మొహమ్మద్ ఫురా?న్, సీనియర్ నాయకులు మొహమ్మద్ ఆమీర్,నాయకులు మహమ్మద్ అయూబ్, మహమ్మద్ చాంద్ పాషా,హాసన్ అలీ బెగ్, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డిచే వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా పంచాంగ ఆవిష్కరణ



**తొలి సమయం, హైదరాబాద్ మర్చి 30:**
రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చే ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని, వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా చే ముద్రించిన విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నందనం కృపాకర్, రాష్ట్ర అధ్యక్షులు రాణా ప్రతాప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు: ఎంపీ రవిచంద్ర



**తొలి సమయం వరంగల్ మార్చ్ 30**
రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పర్వదినం సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముస్లిం సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.నెల రోజుల పాటు నిష్ఠతో ఉపవాస దీక్షలు చేసి రంజాన్ పర్వదినాన్ని జరుపుకుంటున్న తెలంగాణలోని ముస్లిం సమాజానికి దేశవిదేశాలలో నివసిస్తున్న,స్థిరపడిన మన రాష్ట్రానికి చెందిన ముస్లిం సోదరసోదరీమణులకు ఎంపీ రవిచంద్ర శుభాకాంక్షలు చెప్పారు.రంజాన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు నెల రోజుల తమ ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే అతి ముఖ్యమైన పండుగ అని ఎంపీ రవిచంద్ర తన సందేశంలో పేర్కొన్నారు.క్రమశిక్షణ,ప్రేమ,దయ,కరుణ, శాంతి,సహనం, సౌభ్రాతృత్వాన్ని ఇస్లాం బోధిస్తున్నదని,ఇవి నాడు,నేడు, ఏనాటికైనా అనుసరణీయం, ఆచరణీయం అని ఎంపీ వద్దిరాజు వివరించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు హయాంలో అన్ని ధర్మాలను సమదృష్టితో గౌరవించారని చెప్పారు. ముస్లింల భద్రత, సంక్షేమానికి ఎంతగానో ప్రాధాన్యతనిచ్చారని, బీఆర్ఎస్ సీనియర్ నేత మహమూద్ అలీని హెూం శాఖతో ఉప ముఖ్యమంత్రిని చేశారన్నారు. అలాగే,మైనారిటీలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు గాను గురుకులాలను పెద్ద సంఖ్యలో ప్రారంభించారని, విదేశాలలో ఉన్నత కోర్సులు అభ్యసించాలనుకునే యువతకు 20 లక్షల చొప్పున ఉచితంగా అందించడం జరిగిందన్నారు.పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు 1,000,16 రూపాయలు ఉచితంగా అందించారని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.కేసీఆర్ సుపరిపాలనలో రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ దావతులతో పాటు చీరలు, దుస్తులు, నిత్యావసర సరుకులను బహుమతిగా ఇవ్వడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.ఈ పర్వదినాన్ని కుటుంబ సభ్యులు,బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య భక్తిప్రపత్తులతో ఘనంగా జరుపుకోవలసిందిగా ముస్లిం సమాజాన్ని ఎంపీ వద్దిరాజు కోరారు.

# పర్యావరణ విధ్వంసం !



**తొలి సమయం హైదరాబాద్,**
దేశంలో ఎండలు ముదరుతున్నాయి. పట్టణాల్లో ఎండల తీవ్రత తీవ్రంగా ఉంటోంది. గ్రామాల్లోనూ ఎండలు మంటపుట్టిస్తున్నాయి. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో ఇంటిముందున్న చెట్లను నరికి వేస్తున్నారు. కోతుల బెడ నుంచి ఇప్పటికి రక్షణకు కార్యాచరణ కానరావడం లేదు. అడవులను వదిలి అవి గ్రామాల్లో తిష్టవేశాయి. ఇక ప్రజలు మొక్కల పెంపకాన్ని వదిలి చల్లదనం కోసం కూలర్లు, ఎసిలు వాడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఇదే సందర్భంలో కాలుష్యాన్ని కొని తెచ్చకుంటున్నాం. మొక్కలు నాటడం,పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న విషయాలను పక్కన పెట్టారు. ఇదంతా ప్రభుత్వాల పని అన్నట్లుగా ప్రజల భావన ఉంది. అందమైన ఇల్లు కట్టుకుంటున్న వారు సైతం నాలుగు మొక్కలు నాటాలన్న స్పృహ లేకుండా పోతున్నది. మొక్కలు నాటేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఫోటోలకు పోజులిచ్చే కార్యక్రమంగా మారింది. తమ ఇళ్లల్లోనే ఓ మొక్కను నాటి గ్రీన్ ఛాలెంజ్ అంటూ ఇంతకాలం ప్రచారం చేసుకున్నారు. నిజానికి గ్రీన్ ఛాలెంజ్ అంటే గ్రామాల రూపురేఖలు మారాలి. కానీ అలా జరగడం లేదు. హరితహారంలో 200 కోట్లమొక్కలు నాటామిన ఘనంగా చెప్పిఉకున్న బిఆర్ఎస్ పాలకులు వాటి ఆనవాళ్లు ఎక్కడో చూపితే బాగుండేది. అలా జరిగితే కనీస మార్పు వచ్చి ఉండేది. చంద్రబాబు ఉమ్మడి ఎపిలో ఇలాంటి ప్రచారాలే చేసినా ఎక్కడా మొక్కల జాడలేదు. ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పు కోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు పర్యావరణ విధ్వంసానికి కారణ మవుతున్నాయి. వాగులూవంకల జాడలేకుండా పోయింది. కొండలు, గుట్టలను తవ్వేస్తున్నాం. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటిలే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. అంటువ్యాధుల నివారణకు పరిశుభ్రత ముఖ్యమని హెచ్చరి స్తున్నా ప్రజలు చలించడం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకుంటున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికి వేస్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు పలు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవు తుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. అకాల వర్షాలు..తట్టుకోలేని ఎండలు..తట్టుకోలేని చలిగాలులు మనలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పాలకులకు ఇవేవీ పట్టడం లేదు. ఎందుకంటే ఉన్నన్నాళ్లూ పదవి అనుభవించి.. తదుపరి ఏమైతే మాకేంటన్న ధోరణిలో ఉన్నారు. కోట్లాదిమంది చేస్తున్న విధ్వంసం అంటే ప్లాస్టిక్ వాడిపడేం, చెత్తాచెదారం తీసివేయడం వేలల్లో ఉన్న పారిశుద్య సిబ్బందికి సాధ్యం కాదు. కనీసం ఇక్కడైనా ప్రజలను కట్టుబాట్లు పెట్టివుంటే బాగుండేది. ప్రజలు పారిశు ధ్య పనులు లాంటివి ఎందుకనో చేయడం లేదు. దీంతో కాలుష్యం మళ్లీ పెరుగుతోంది. ఎక్కడిక్కడ చెత్తకుప్పలు పేరుకు పోతున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో కాలువల్లో అవన్నీ నిండి మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా తయారయ్యింది. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలు కూడా చెత్తను బయటకు విసిరేసి చోద్యం చూస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో కాలం గడిపేస్తున్నారు. చెత్త పేరుకుపోయిందని ..అందుకు ప్రభుత్వానిదే బాధ్యతన్నట్లుగా దీరాలు తీస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం లాంటి విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దగా పట్టింపు లేకుండా ఉన్నాయి. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా..భూగర్బ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటికాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. పర్యావరణ విధ్వంసం పై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగిపోతున్నాడు. ఎండ వేడిమి, వడగాడ్పులతో ప్రజలు అల్లాడి పోతున్నారు.

# పెరుగుతున్న విద్యుత్ వినియోగం

### - మండుటెండలతో అధిక వాడకం - విద్యుత్ అధికారుల అప్రమత్తం

**అమరావతి,మార్చి30:** మంచినీటురు, విద్యుత్ సరఫరా విషయంలో సిఎం చంద్రబాబు కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడా సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. అయితే ఇప్పటికేసమస్యలు ముంచుకొస్తున్నాయి. నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సదరన్ డిస్కం పరిధిలోని ఎనిమిది జిల్లాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గతేడాది మార్చితో పోల్చుకుంటే ఈ ఏడాది మార్చిలో యూనిట్లు అధికంగా వినియోగించారు. సదరన్ డిస్కం పరిధిలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చి నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. దీంతో ప్రజలు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం పెంచారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టే పనిలో ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యుత్ వినియోగం పెరిగినందున గ్రామీణ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచకపోతే సరఫరాలో ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. గతంలో ఎన్నడూ ఇంతగా వినియోగంలేదని విద్యుత్ శాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుదుత్పత్తి, సరఫరా బాగానే ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను తగినంతగా పెంచుకోకుంటే అవి తరచూ పేలిపోయే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎండ తీవ్రతకు రాష్ట్రం నిప్పులకొలిమిలా మారింది. ఉత్తరాది గాలులతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు వాతావరణం బాగా వేడెక్కింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర వేడి కొనసాగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రావడాని కే భయపడుతున్నారు. కోస్తా, రాయలసీమల్లో కొన్నిచోట్ల 40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండుమూడు రోజులు ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. సూర్యుడు సెగలు కక్కుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొద్దిరోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రత నిత్యం 38డిగ్రీలు దాటు తోంది. ఇప్పుడే ఇలా ఉంటే ఇక ఏప్రిల్,మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ రోడ్లపై జనసంచారం కనిపించట్లేదు. భూగర్భ జలాలు అడుగం టడం, భూతాపం పెరిగిపోవడంతో మంచినీటిసమస్య కూడా అధికం అవుతున్నది. బోర్లువేసి నీటిసమస్య కొంత తగ్గించాలని భావించినా ఎంత లోతుకు తవ్వినా నీళ్లు రాని పరిస్థితులు దాపురించాయి.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101